

మంచం మీద రోగి — ఐనా

స్వప్న జగత్తులో పరిగెత్తి ఆయాసినట్టుగా ఆ మొహం...

"ఏవేవ్- చూసేవా- నెత్తిమీద ఓ నల్ల వెంట్రుక మొలిచిందే!- చూడవే".

"సరే- మీకూ, నాకూ నెత్తిన నల్ల వెంట్రుక మొలవడం గూడానా! ఇహనే కాస్త నూనెపోసి పెంచండి.... డాక్టరొస్తాడు- పడుకుందురూ!"

"అన్నట్టూ నా సంగతి చెబితే గుర్తొచ్చింది- నువ్వు 'నస్య వర్తి' వేసుకున్నావూ?....డాక్టరుముండావా ఏ గుంజుకు మరీ చెప్పేడు"- ఆయన గారి తీవ్ర వేదన!

"పోనిస్తురూ వెధవమందు- మీకు లేచి తిరగ్గలిగిన రోజున తింటాలెండి మందుల కేవి భాగ్యం! కాదు గానీ- మిమ్మల్ని ఒక్క ప్రశ్న వెయ్యనా?"

"వెయ్యి - వెయ్యి!"

"వెయ్యిగాదు ఒక్కటే!- నేనంటే మీకు ఏ కోశాన్నైనా ప్రేమ వుందీ?!"

"అరవయేళ్ళ వయసున్న ఒక్కటి అనుమానపు ముద్దవి నువ్వు"

"ఇదిగో- మీలా రాసేవాళ్ళంటే మహ మంట- తిన్నగా చెబుదురూ!"

"ప్రేమ లేకుండా ఏవుందో గుర్తులేదు- అంటే సంగతవన్నీ పోయేవ్- ప్రేమ తప్పించి"

"చూసేరా మరి- మీ అప్పగారికి, మనవలకి, నా పింతల్లికి, పిల్లలకీ.... ఎవళ్ళకీ మన మీద ప్రేమ లేదు.

"వెర్రిదానా ఒకాళ్ళ కోసమో, ఒకాళ్ళ్ని ప్రేమించడవేవుందీ? స్వార్థంలేకపోతే ప్రేమ వుండదూ మరి!"

"ఐతే ఇహనే- మీరు ఏ పిల్లినో పెళ్ళి జేసుకుండాల్సింది..."

మనసునీ, సంఘాన్నీ, మనిషినీ విడి విడిగా చూడ్డంతోనే మనకి గుడ్డితనం, ప్రేమ రాహిత్యం వొస్తుంది"

"దీన్నే వెర్రి అనరూ?!"

○ ○ ○

"కోమాకీ కోమాకీ మధ్యన వున్నాడాయన.... ఎక్కువ మాట్లాడించకండి"— డాక్టరు బోధ.

○ ○ ○

"విజ్ఞానం వికటించకండా వుండటవే బోధపడ్డం- భ్రమ తెలుసుకోడం జ్ఞానమే- కోడల్నీ, పిల్లల్నీ, కూతుర్నీ- ఎవర్నీ బాగు చేదవనుకోకు- వాళ్ళ బలహీనతలతో సహా ప్రేమించు-"

"ఎక్కపోయి అడిగా ఇహ కాస్సేపు కన్నుమూస్తే- నిద్రదుతుందేమో!"

○ ○ ○

"నీ ఆరోగ్యం జాగ్రత్త- నువ్వెంత ప్రేమగా వుంటావో, పిల్లల తరంకి ప్రేమ అంటె గుర్తుండేలా చూసుకో- అదే ఆస్తిగా పంచిపెట్టు.... నే వెడుతున్నా...."

"వూరుకుందురూ, ఏవిటా మాటలు! పావిష్టిముండని నే పోయినా బావుండు-మళ్ళీ సారేనా మీకే సేవ జేసు...."

"నే మాత్రం ప్రేమగా పుడితేచాలు.... మనుషులమీద ప్రేమగా-"

○ ○ ○

ఆయన పోయాడు— ఆరోగిష్ఠి ముసలాయన... ఆవిడ విలవిల్లాడుతోనే వుంది.... ఆనక మామూలే.... తద్దినం పోగ, చుట్టాలు.... కాకులు.... మధ్యాన్నం మూడింటికి 'భోజనాలు'... కాలక్షేపం.... ఆకలి మనిషికి మిగిలిన గాతెలు...

ఖచ్చితంగా పోయాడాయన. ఆశయపు కిటికీలోంచి చల్లగాలిలా ఆయన వెళ్ళి... వెళ్ళి.... వెళ్ళి...

○ ○ ○

నడిరోడ్డులాటి ధర్మాసుపత్రి. వరండాలో మూలుగులు, పెడబొబ్బలు, కొంచెం ఇంగ్లీషు.... తెల్లటి పిట్టలాటి నర్సులు.... స్టెత్ సర్పాలు... వాటి మధ్యన ప్రవేశం దొరికి వైద్యం ఇంకా అందని ముసలి ముతక చిరుగులాటి.

ఓ ముసలాడి చూపులు.... చేమనోరు... గోడమీద కిళ్లీ వుమ్ములాగ- అక్కడ అతను- పరమ నిర్లక్ష్యంగా పారేయబడ్డట్టు-

ఎవరి బంధువులో బుట్టనిండా పళ్ళతో ఆ జనాన్ని దాటుతూ పోతున్నారు. ఆ బుట్ట లోంచి ఓ బత్తాయి పడి దొర్లి.... దొర్లి ముసలాడి వొణుకుడు చేతికి చిక్కాలనీ— ఆశగా, ప్రేమగా, కరుణగా, నయగా, జాలిగా, చేరింది- సమాగమంలా.... భావ కవి పరిష్వంగలా... స్వేచ్ఛగా....

రోగిష్ఠి దిక్కుమాలిన ముసలాడి ఆశల చేతులు ఆ పండు తోలునితీసి, తొనలని బోసి నోట్లో నలుపుతోంటే.... ఆ పండుగా పుట్టి, ఆ ప్రేమగా, ఆ కన్నీటిలా, త్రికాల ప్రేమ వాహినిలా ఆ పోయిన ముసలాయన కానిండాడు.... ప్రేమగా, ప్రేమకోసమే-•

తల్లావఝ్ఝల శివాజీ